క్లుప్తంగా

డాక్యుమెంట్లు అందజేయాలి

మర్రిపాడు: 2024 – 25 పంట కాలానికి ఎరువుల సరఫరా కోసం ఇండెంట్ ఇచ్చిన పొగాకు రైతులు వారం రోజుల్లో బ్యాంక్ లోన్ కోసం బ్యాంక్ డాక్యుమెంట్లు జత చేసి సూపర్‌వైజర్లకు అందజేయాలని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్యుమెంట్లు ఆలస్యమైతే ఎరువులు కూడా ఆలస్యమవుతాయన్నారు. బ్యాంక్ లోను వద్దనుకునే వారు అడ్వాన్స్ పోను మిగిలిన నగదును ఆన్‌లైన్ ద్వారా బోర్డుకు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు సూపర్‌వైజర్లను సంప్రదించాలన్నారు.

సంగం బ్యారేజీ నుంచి నీటి విడుదల

సంగం: సంగం బ్యారేజీ నుంచి దిగువకు మంగళవారం నీటిని విడుదల చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వరద నీరు చేరనుంది. ముందస్తు చర్యల్లో భాగంగా సోమశిల నుంచి సంగం బ్యారేజీ నీటిని విడుదల చేశారు. అధికారులు 12 గేట్లు ఎత్తి సముద్రానికి నీటిని వదిలారు.

పురస్కారం ప్రదానం

కావలి: కావలి డీఎస్పీ శ్రీధర్‌కు జాతీయ రక్తదాన దినోత్సవ పురస్కారాన్ని స్థానిక రెడ్‌క్రాస్ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో మోటివేటర్లకు పురస్కారాలను అందజేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అత్యధిక సంఖ్యలో రక్తదాన శిబిరాలు నిర్వహించిన కావలి సబ్ డివిజనల్ పోలీస్ వారు పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీధర్ ఆ సమయంలో తిరుమల బ్రహ్మోత్సవాల విధుల్లో ఉన్నారు. ఆయన తిరిగి కావలికి రాగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు పురస్కారం అందజేశారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు

ఉదయగిరి: నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం భారంగా మారిందని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. ఆయన మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడుతూ లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు గ్రామాల్లో బెల్టుషాపుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా గాలికొదిలేసిందన్నారు. విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటుచేసి ధరలు తగ్గించాం, బాగా తాగమని చెప్పడం దారుణమన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జున, లక్ష్మీనరసయ్య, కోడె రమణయ్య, రమణయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

కలిగిరి: వర్షాల నేపథ్యంలో కలిగిరి పంచాయతీలో కార్యదర్శి రవిచంద్ర పర్యవేక్షణలో మంగళవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. కాలువలను శుభ్రపరిచారు. రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేయించారు. వెంకన్నపాళెంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వార్డు సభ్యులు వేమనారాయణ, రవి ఎస్టీ కాలనీవాసులకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

వైభవంగా గంధమహోత్సవం

అనుమసముద్రంపేట: మండలంలోని అనుమసముద్రం పంచాయతీ పరిధిలో జామా మసీదు సెంటర్‌లో గౌసే ఏ పాక్ నిషాన్ వద్ద 41వ గంధమహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఫకీరుల దప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, పూలపల్లకి మధ్య ఉత్సవాలను నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా ఏఎస్‌పేట దర్గాకు తీసుకెళ్లారు.

ఆశ్రమం మాటున అరాచకాలు

- డీఎస్పీకి బాధితుల ఫిర్యాదు

కావలి: కావలి మండలం అన్నగారిపాళెం సమీపంలో దౌర్జన్యాలకు దిగుతున్న స్వామి అవతారంలో ఉన్న ఆశ్రమ నిర్వాహకుడు, అతని బంధువులపై బాధితులు మంగళవారం రాత్రి కావలి డీఎస్పీ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. పూజలు, ఇతర అవసరాల పేరుతో పలువురి వద్ద అప్పులు చేసి తప్పించుకు తిరుగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్వామి ఇంటికి బాధితులు తాళాలు వేశారు. దీంతో అతని భార్య, అత్త మరో ఐదుగురితో కలిసి మంగళవారం తాళాలు వేసిన వారిపై దాడికి దిగారు. చంపేస్తామని బెదిరించడంతో బాధితులంతా డీఎస్పీని కలిశారు. ఆశ్రమం మాటున అరాచకాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అప్పులిచ్చిన వారిని బెదిరిస్తున్నారని వాపోయారు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థలం ఇచ్చి తాము ఇళ్లు కట్టిస్తే అతని పేరుతో పన్ను వేయించుకుని, సర్వే నంబర్‌ను మార్చేసి దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని వాపోయారు.

జనాభా ఫుల్.. సదుపాయాలు నిల్


కావలి పట్టణంలోని కొత్త శివాలయం వద్ద ఉన్న నివాస గృహాలను వర్షపునీరు చుట్టుముట్టింది. నీరు పోవడానికి కాలువలు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.


ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. కల్వర్టు లేకపోవడంతో వర్షపునీటి ప్రవాహం రోడ్డును ధ్వంసం చేసేసింది.


17వ వార్డులోని ఓ గ్రావెల్ రోడ్డు ఇది. వర్షాలకు గోతులమయం అయిపోయింది. దీనిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకం చూస్తున్నారు.


ఇది జనతాపేటలోని ఒక ప్రధానమైన రోడ్డు. ఇది బాగున్నా వర్షపునీరు కాలువలో ప్రవహించే వీలు లేకపోవడంతో నిల్వ చేరుతోంది.

- కావలి పట్టణంలో రోడ్లపై గుంతలు
- వాన పడితే అడుగుపెట్టే వీలే లేదు
- డ్రెయినేజీ సమస్య సరేసరి
- అభివృద్ధికి నోచుకునేదెప్పుడో..

కావలి: వర్షం కురిస్తే చాలు.. కావలి పట్టణం అధ్వానంగా తయారవుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతుంటారు. జిల్లా కేంద్రమైన నెల్లూరు తర్వాత పెద్ద పట్టణం కావలి. అలాగే ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాలకు చెందిన గ్రామాలు కావలి చుట్టుపక్కల ఉన్నాయి. దీంతో అనేకమంది చదువులు, వైద్యం, ఇతర వాటి కోసం ఇక్కడ నివాసం ఉంటున్నారు. 61.09 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్న పట్టణంలో 2.5 లక్షల మంది జనాభా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఇది ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉంది. 2 లక్షల మంది జనాభా ఉంటే స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా గుర్తించాలని మున్సిపల్ చట్టం చెబుతోంది. అప్పుడు ప్రభుత్వ నిధులు మంజూరు చేయడంతోపాటు కొన్ని అంశాల్లో ప్రత్యేకత ఉంటుంది. అయితే ఇప్పటి వరకు ఆ ప్రక్రియకు నోచుకోలేదు.

దారుణంగా..

పట్టణంలో జనాభాపాటు, నివాసాలు కూడా పెరిగిపోతున్నాయి. అయితే మున్సిపాలిటీ ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు సమకూరడం లేదు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ విషయంలో పూర్తిగా విఫలమైంది. నిధులు మంజూరు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. పట్టణంలో పలు రకాల రోడ్లు 300 కిలోమీటర్లు ఉన్నట్లు మున్సిపాలిటీ రికార్డుల్లో ఉంది. వాటిలో కనీసం 50 కి.మీ కూడా ప్రజలకు ఉపయోగపడే స్థితిలో లేవు. అధికశాతం గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇక అన్ని రకాల డ్రెయినేజీ వ్యవస్థ 450 కి.మీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే సవ్యంగా పారే కాలువలు 50 కి.మీ కూడా లేవు. వర్షాలు కురిస్తే అరకొరగా ఉన్న కాలువల్లో నీరు సక్రమంగా ప్రవహించక, రోడ్లపైనే నిల్వ చేరుతోంది. నిర్మాణంలో ఉన్న రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, నిర్మించనున్న దామవరం విమానాశ్రయం కావలి సమీపంలో ఉన్నాయి. భవిష్యత్‌లో పెరగనున్న పట్టణ విస్తీర్ణం, జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం 500 కి.మీ రోడ్లు ఉండాలి. అలాగే 700 కి.మీ డ్రెయినేజీ ఉండాలి.

> **మురికి కూపాలుగా రోడ్లు, కాలువలు**
>
> వర్షమొస్తే మురికి కాలువల్లో నీరు రోడ్ల మీదే ఉంటుంది. ఇళ్ల నిర్మాణాలు చేసేవాళ్లు ఇసుక, గ్రావెల్‌ను కాలువల పక్కన తోలడం సమస్యగా మారింది. కొద్దిపాటి జల్లులకే బురదమయమై రైతుబజారుకు, ఇతర ప్రదేశాలకు పోవాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.
>
> – చాకలికొండ శారద, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, కావలి



అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని మంగళవారం నిర్వహించారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ, ఇతర సామాజిక సంస్థల ఆధ్వర్యంలో కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ బీసీ అడ్వొకేట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నూరుద్దీన్, దామా నాగరాజు, సుబ్బరాయుడు, ప్రసాద్, ఏకోబు పాల్గొన్నారు.

- చేజర్ల: ఆదూరుపల్లిలో మంగళవారం కలామ్ జయంతిని నిర్వహించారు. మైనార్టీ నాయకుడు షేక్ బషీర్, పఠాన్, షాన్‌వాజ్ పాల్గొన్నారు.
- కావలి: అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా మంగళవారం కావలి రెడ్‌క్రాస్ సభ్యులు, రక్తకేంద్రం సిబ్బంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ కె.హరినారపరెడ్డి మాట్లాడారు. రక్తదానం చేసిన సిబ్బంది వి.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ వెంకటేశ్వర్లు, డీవీ పద్మావతి (26వ సారి), ఇండ్ల అనిల్‌కుమార్, జూనియర్ రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ పసుపులేటి సాయికుమార్ (20వ సారి), ఇతర రక్తదాతలు ఆర్.మాధవ, జి.శ్రీకాంత్, జి.శేషు, ఎండీ వసీమ్ అక్రమ్, వి.వంశీ, పి.ప్రమోద్‌లను కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, యూత్ రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ పీవీ సాయితేజ అభినందించారు.


చేజర్ల మండలంలో..

కార్యదర్శులతో సమావేశం

సీతారామపురం: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మారుబోయిన భాస్కర్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారితో సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు పొంగే అవకాశం ఉందని, ప్రజలు వాటివద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భార్గవీరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ నేడు

సీతారామపురం: స్థానిక పడమటివీధిలోని రామాలయం వద్ద బుధవారం ఉదయం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విగ్రహ దాత పసుపులేటి వెంకటేశ్వర్లు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

- ఆర్డీఓ పావని



ఆత్మకూరు: వర్షాల నేపథ్యంలో పునరావాస కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో తుఫాన్ సమాచార కేంద్రాన్ని కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

వరికుంటపాడు: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని నార్త్ కొండాయపాళెం, కనియంపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ధర్మవరం ఎస్సీ కాలనీలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

సాగరంలో గ్రామోత్సవం



సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలో మంగళవారం ముస్లింలు గ్యార్మీ ఉత్సవాలను నిర్వహించారు. గ్రామోత్సవం చేసి భక్తులకు గంధాన్ని పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆగని వాన

కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని పలుచోట్ల మంగళవారం కూడా వాన పడింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీస్ ఉన్నతాధికారులు తీర ప్రాంతాల్లో పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు.

- అప్రమత్తమైన అధికారులు
- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- తీరంలో మత్స్యకారులకు సూచనలు


సంగం: మర్రిపాడు చెరువు వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం


అల్లూరులో వర్షం


కావలి: గాలులకు దెబ్బతిన్న పూరిళ్లు

డివిజన్ పరిధిలో వర్షపాతం ఇలా..

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలను ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా సంగం మండలంలో 125.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా సీతారామపురం మండలంలో 40.2 మి.మీ వర్షం కురిసిందన్నారు. ఆత్మకూరులో 81.2 మి.మీ, ఉదయగిరిలో 49.6 మి.మీ, ఏఎస్‌పేటలో 74.2 మి.మీ, అనంతసాగరంలో 111.4 మి.మీ, కలువాయిలో 89.2 మి.మీ, చేజర్లలో 105.6 మి.మీ, మర్రిపాడులో 63.6 మి.మీ నమోదైనట్లు వివరించారు.

వింజమూరు(ఉదయగిరి): బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ సయ్యద్ హమీద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు మండలంలో 67 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా వర్షానికి వింజమూరులోని జీబీకేఆర్ ఎస్టీకాలనీలో ఇండ్ల ప్రమీల ఇంట్లో విద్యుత్ తీగ తెగి రూ.37 వేలు విలువ చేసే గేదె షాక్‌తో మృతిచెందింది. కాలనీలో పలుచోట్ల నిల్వ ఉన్న నీటిని యంత్రాలు ఉపయోగించి కాలువలు తీసి బయటకు పంపారు. అనేక పల్లెల్లో అంతర్గత రోడ్లు చిత్తడిగా మారాయి. వింజమూరు బంగ్లా సెంటర్, మెయిన్ రోడ్డు, వివేకనంద స్కూల్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నర్రవాడ గిరిజన కాలనీలో పర్యటన

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ గిరిజన కాలనీలో మంగళవారం తహసీల్దార్ యనమల నాగరాజు పర్యటించారు. భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. మండలంలో పలు గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

జాగ్రత్తగా ఉండాలి

జలదంకి: వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ ప్రమీల తెలిపారు. మంగళవారం ఆమె రెవెన్యూ సిబ్బందితో కలిసి జలదంకి ఎస్టీ కాలనీని పరిశీలించారు. వర్షపునీరు ఇళ్లలోకి వస్తే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. ప్రతి గ్రామంలో వీఆర్వోలు ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ రామారావుతో కలిసి జలదంకి పెద్ద చెరువును పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వారి వెంట డీటీ జూలీభాయ్, ఆర్‌ఐ శ్రీజ, జలదంకి వీఆర్వో గిరిధర్‌రెడ్డి తదితరులున్నారు. మంగళవారం ఉదయం కొంతసేపు వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి చిరుజల్లులు పడ్డాయి.

డీఎస్పీ పరిశీలన

అనుమసముద్రంపేట: మండలంలోని గుడిపాడు వాగును, అనుమసముద్రంలోని నక్కల వాగును, తెల్లపాడు వద్దనున్న బీరాపేరు కలుజు వాగును ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. వాగుల వద్ద పోలీసులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్‌పేట ఎస్సై సైదులుకు సూచించారు. ఆయన వెంట సంగం సీఐ వేమారెడ్డి, ఏఎస్సై భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

గ్రామస్తులకు అవగాహన

సంగం: వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అధికారులు ముమ్మరంగా పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. వంగల్లులోని చెరువు వద్ద కలుజును ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్, సీఐ వేమారెడ్డిలు మంగళవారం పరిశీలించారు. ప్రాణనష్టం జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు చెరువులు, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై రాజేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం ఎస్టీ కాలనీలో తహసీల్దార్ సోమ్లానాయక్ పర్యటించారు. మండలంలోని మర్రిపాడు చెరువు ట్యాంక్ బండ్ వద్ద ఇరిగేషన్ ఈఏ వినయ్ ఆధ్వర్యంలో ఇసుక బస్తాలు వేసి మరమ్మతులు చేపట్టారు.

ప్రజలకు సూచనలు

చేజర్ల: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మస్తానయ్య తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని సోమశిల జలాశయానికి వరద ప్రవాహం ఎక్కువై గేట్ల ద్వారా నీటిని వదిలితే ఇక్కడకు వచ్చే అవకాశముందన్నారు. ఆయా ప్రాంతాల్లో వీఆర్వోలను పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. పెరుమాళ్లపాడు, కోటితీర్థం, పుట్టుపల్లి, టికేపాడు తదితర గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించామన్నారు.

133 మంది తరలింపు

ఆత్మకూరురూరల్: భారీ వర్షాల దృష్ట్యా మండలంలోని మూడు పునరావాస కేంద్రాలకు 133 మందిని తరలించామని ఆత్మకూరు తహసీల్దార్ సుధీర్ మంగళవారం తెలిపారు. బండారుపల్లిలోని ఎంపీయూపీ స్కూల్లో 15 మంది, అప్పారావుపాళెం రైతు భరోసా కేంద్రంలో 58 మంది, కరటంపాడు ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 60 మందికి సౌకర్యాలు కల్పించామన్నారు. వీరికి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల ఆధ్వర్యంలో అవసరమైన సహాయక చర్యలు నిరంతరం అందజేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

పునరావాస కేంద్రానికి..

కావలి: పట్టణంలో వర్షాలు వల్ల ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించే పనిలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, అధికారులు నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలైన ముసునూరు ఉన్న మర్రిచెట్టు సంఘం, మందాటి చెరువు వద్ద ఉంటున్న ప్రజలను అదే ప్రాంతంలో ఉన్న జెడ్పీ హైస్కూల్, రామమూర్తిపేటలోని మున్సిపల్ స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వైకుంఠపురం ప్రాంతంలోని కావలి చెరువు వద్ద ఉన్న శివరామ సుబ్బయ్య కాలనీలో ప్రజలను అక్కడి పునరావాస కేంద్రానికి పంపారు. మందులు పంపిణీ చేశారు. అలాగే భోజనం, తాగునీరు అందజేశారు. లోతట్టు ప్రాంతాలను మంగళవారం ఆర్డీఓ ఎం.వంశీకృష్ణ పరిశీలించారు.

ఎడతెరిపిలేని వర్షం

అల్లూరు: మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాల నేపథ్యంలో ఇస్కపల్లి తీర ప్రాంతాన్ని సీఐ పాపారావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడారు. వేటకు వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట అల్లూరు ఎస్సై కిశోర్‌బాబు, బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తీరప్రాంత గ్రామాల్లో..

బిట్రగుంట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తీరప్రాంత గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తహసీల్దార్ సురేష్ కుమార్, కావలి రూరల్ సీఐ బి.పాపారావు సిబ్బందితో కలిసి మంగళవారం తీరంలో పర్యటించారు. మత్స్యకార గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల ముప్పు తప్పే వరకూ వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచించారు. అత్యవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలకు అనుకుని ఉన్న ఇళ్లు, బలహీనంగా ఉన్న ఇళ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదే విధంగా రొయ్యల గుంతల వద్ద కాపలాగా ఉంటున్న కుటుంబాలను పరిశీలించారు. భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తే వారంతా ఇబ్బంది పడకుండా ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. కాగా అల్పపీడన ప్రభావంతో మంగళవారం కూడా మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి చెదురుమదురు జల్లులు పడుతూనే ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లో వీధులన్నీ నీళ్లతో నిండిపోయాయి. స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.


ఏఎస్‌పేట: గుడిపాడు వద్ద వాగును పరిశీలిస్తున్న డీఎస్పీ


బిట్రగుంట: ఎస్పీపాళెం వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్


సంగం: అన్నారెడ్డిపాళెం ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్


ఎస్టీకాలనీలో మృతిచెందిన గేదె


బిట్రగుంట: తాటిచెట్లపాళెం వద్ద మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ


ఆత్మకూరురూరల్ : పునరావాస కేంద్రానికి చేరుకున్న గిరిజనులు


దుత్తలూరు: నర్రవాడ గిరిజన కాలనీవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్


జలదంకి: బ్రాహ్మణక్రాక ఎస్టీ కాలనీ లోతట్టు ప్రాంతం వద్ద రెవెన్యూ సహాయకులు


కావలి : ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ, కమిషనర్